ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH
Friday , March 17, 2006 22:39 hrs IST

# ప్రవాసుల ప్రతిభకు మైత్రిమండలి సత్కారం




ఐఎఎఫ్‌సీ టెక్సాస్ స్టేట్ కోఆర్డినేటర్ తోటకూర ప్రసాద్ ప్రసంగం

భారత్ అమెరికాల మైత్రి మండలి(ఐ.ఎ.ఎఫ్.సి) వార్షికోత్సవ సభను టెక్సాస్‌లోని రిచర్డ్‌సన్‌లో ఉన్న ఫన్‌ఏషియా సమావేశ మందిరంలో మార్చి 11న నిర్వహించారు. ప్రతి ఏటా మైత్రి మండలి నిర్వహించే వార్షికోత్సవంలో పెద్ద ఎత్తున ప్రముఖులు పాల్గొంటారు. అమెరికాలో విశేష ప్రతిభ చూపుతున్న భారతీయ సంతతికి చెందిన వారిని మైత్రి మండలి ఈ సందర్భంగా సన్మానించింది. ప్రముఖ అమెరికన్ కాంగ్రెస్ మెన్ బాబిజిందాల్, యువశాస్త్రవేత్త నీలాతంగడా, ప్రముఖ విలేఖరి అజీజ్‌హనీఫా, డాక్టర్ భానుమతి ఇవేట్యూరి సన్మాన గ్రహీతలలో ఉన్నారు.





మైత్రి మండలి కార్యవర్గ సభ్యుడు పీయూష్‌పటేల్ ఆహూతులకు స్వాగతం పలికారు. బాబిజిందాల్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. భారతీయ కాన్సులేట్ జనరల్ శశి ఎమ్. గవయ్, ఇండియా అబ్రాడ్ మేనేజింగ్ ఎడిటర్ అజీజ్ అనిప్ఫా, వినోదకుమార్, మంజూ బన్సల్ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఉన్నారు. విదిశా బబిలి అమెరికా జాతీయ గీతాన్ని ఆలపించగా ప్రముఖ భారతీయ గాయకులు ఆశాభోంస్లే, లతామంగేష్కర్, హరిహరిన్, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యాం, ఎ.ఆర్. రెహ్మాన్ తదితరులు భారత జాతీయ గీతం పాడిన వీడియోని పెద్దతెరపై ప్రదర్శించారు.

భారత్ అమెరికాల మైత్రి మండలి వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మైత్రి మండలి నిర్వహిస్తోన్న ప్రముఖ పాత్ర గురించి వివరించారు. "పదిహేను సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన మైత్రి మండలి నేడు ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించింది. మైత్రి మండలి అమెరికా భారత్‌ల మధ్య సత్సంబంధాలను నెలకొల్పడానికి చేస్తున్న కృషిని అమెరికన్ కాంగ్రెస్ గుర్తించింది. వాషింగ్టన్‌లో నిర్వహించే వార్షిక శాసనసభ్యుల సమావేశంలో 150 మంది కాంగ్రెస్ సభ్యులు, సెనేటర్లు, అంబా

సిడర్లు పాల్గొంటారు. భారత్ అమెరికాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పటంలో క్రియాశీలక పాత్ర పోషించవలసిన అవసరం ఉంది." అన్నారు. క్యాన్సర్ నిర్మూలనకు విశేషంగా కృషిచేస్తున్న 'అమెరికన్ క్యాన్సర్ సొసైటీ'కి మైత్రి మండలి కోశాధికారి డాక్టర్ సి. ఆర్. రావు ఈ సందర్భంగా 1000 డాలర్ల చెక్కును అందజేశారు.



సమావేశ ముఖ్య అతిథి భారతీయ కాన్సులేట్ జనరల్ శశి ఎమ్. గవయ్ మాట్లాడుతూ ప్రవాస భారతీయులకు పౌరసత్వం ఇవ్వాలన్న భారతదేశ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భారతదేశ పౌరసత్వం పొందడానికి ఆసక్తిగా ఉన్న ప్రవాస భారతీయులు " **www.cgihouston.org**" వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. మైత్రి మండలి చేస్తున్న అభివృద్ధి పనులను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కాన్సులేట్ సేవల ద్వారా ప్రవాస భారతీయులకు శశి ఎమ్. గవయ్ చేస్తోన్న సేవలకు గుర్తింపుగా మైత్రిమండలి కార్యవర్గ సభ్యుడు డాక్టర్ తారాకుమార్ రెడ్డి జ్ఞాపికను అందజేశారు. డిస్కవరీ చానల్ నుంచి "అమెరికా యువ శాస్త్రవేత్త" అవార్డును అందుకున్న నీలా తగడాకు మైత్రి మండలి "బ్రైటెస్ట్ స్టార్" అవార్డును బహుకరించింది. ప్రముఖ సమాజ సేవికరాలు డాక్టర్ భానుమతి చేస్తున్న సేవలకు గుర్తింపుగా శశి ఎమ్. గవయ్ " ఔట్ స్టాండింగ్ కమ్యూనిటి సర్వీస్" అవార్డును ఆయనకు ప్రధానం చేశారు. భానుమతి ప్రస్తుతం తానా, ఐ. ఎ. ఎన్. టి సంస్థలకు సోషల్ సర్వీసెస్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఇండియా అబ్రాడ్ మేనేజింగ్ ఎడిటర్ అజీజ్ హనిఫా మాట్లాడుతూ "ప్రస్తుతం అమెరికా భారతదేశాల మధ్య సంబంధాలు మెరుగ్గా ఉన్నాయి. భారత్ పర్యటనలో బుష్ అణు ఒప్పందం పై సంతకం చేయడం చరిత్రాత్మకం. భారత్ అమెరికాల మైత్రి మండలి వ్యవస్థాపకుడు కృష్ణారెడ్డి చేస్తున్న సేవలు విశేషమైనవి. భారతదేశం పట్ల అమెరికా తీసుకుంటున్న ప్రతి చర్యను నిశితంగా గమనించాల్సిన అవసరం ఉంది" అని అన్నారు.

ముఖ్య అతిథి కాంగ్రెస్‌మెన్ బాబి జిందాల్ కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఉదాసీన వైఖరివల్లే కత్రినా బాధితులకు సహాయం అందలేదని ఉదహరించారు. "నా తల్లితండ్రులే నాకు రోల్ మోడల్.

వారు నన్ను డాక్టర్‌గా చూడాలనుకున్నారు కానీ నా అభిరుచి మేరకే రాజకీయాలలో వచ్చాను. ప్రస్తుతం నేను నిర్వర్తిస్తున్న వృత్తి పట్ల వారు సంతోషంగా ఉన్నారు. జన వరిలో భారతదేశంలో పర్యటించాను. భారత్ త్వరగా అభివృద్ధి చెందుతోంది. భారత్ అమెరికాలు అణు ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషించదగ్గ విషయం. అణు ఒప్పం దం పై సభలో ఆమోదం తెలపాల్సి ఉంది. యువత వారికి ఇష్టమైన వృత్తిని ఎం చుకుని ఆ రంగంలో రాణించాలి" అని బాబి జిందాల్ అభిప్రాయపడ్డారు.

భారత్ అమెరికాల మైత్రి మండలి వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణారెడ్డి , టెక్సాస్ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రసాద్ తోటకూర బాబిజిందాల్‌కు "ఇండియన్ అమెరికన్ ప్రైడ్" అవా ర్డును బహుకరించి సన్మానించారు. మైత్రి మండలి విన్నపంతో బాబిజిందాల్ అజీజ్ హనీఫాకు "ఉత్తమ జర్నలిస్ట్" అవార్డును అందజేశారు.

ఈ సందర్భంగా ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ "ప్రవాస భారతీయుల్లో రాజకీయ అవగాహన తీసుకురావడంలో, భారత్-అమెరికాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడా నికి మైత్రిమండలి కృషి చేస్తుంది. ప్రతి సంవత్సరం ప్రముఖంగా సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థలను గుర్తించి వాటిని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటుంది. కేవలం భారతీయ సంబంధిత విషయాలతోనే సరిపెట్టుకోక దేశంలో సాంఘిక భద్రత, నిరుద్యోగం, ఆరోగ్యం, విద్యా, ఇమ్మిగ్రేషన్, ఆర్థికవిషయాల్లోనూ దృష్టి సారిం చాలి. భారత-అమెరికా అణు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అణు ఒప్పందం సభలో ఆమోదం పొందాలంటే శాసన రూపకర్తలతో చర్చించి ఒప్పించాల్సిన ఆవశ్యకత ఉం ది" అని అన్నారు.

మైత్రి మండలి డైరెక్టర్ కేతన్‌పటేల్ మాట్లాడుతూ కార్యక్రమం ఘనంగా నిర్వహించ డానికి తోడ్పడినటువంటి కంపెనీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. హాజరైనవారందరికీ ధన్యవాదాలు తెలుపుతూ సమావేశాన్ని ముగించారు.